క్లుప్తంగా

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: ప్రయాణికులు దాహార్తి తీర్చేందుకు సానా సతీష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గురువారం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎండలు తగ్గేంత వరకూ ఈ చలివేంద్రం ఉంటుందని ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ తెలిపారు. నిత్యం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ మజ్జిగ పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సంస్థ సభ్యులు శ్రీను, సతీష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ పొందుతున్న ఏడీఏ, ఏఓలు

కాకినాడ రూరల్: ఏపీ వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ(ఏపీసీఎన్ఎఫ్) ఆధ్వర్యంలో మండలంలోని గంగనాపల్లి గ్రామంలోని వేద పాఠశాలలో గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. మూడు రోజుల శిక్షణలో భాగంగా ఏడీఏ, ఏఓలు క్షేత్ర స్థాయి సందర్శన చేశారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా డీపీఎం యూజీ ఏలియాజర్ అధ్యక్షత వహించారు. వ్యవసాయ శాఖ అధికారులకు పీఎండీఎస్, కిచెన్ గార్డెన్ కిట్స్, కషాయాలు, ద్రావణాలు, అమృతాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాకినాడ ఏడీఏ బాబూరావు, పిఠాపురం ఏడీఏ స్వాతి, జగ్గంపేట ఇన్‌చార్జి ఏడీఏ గంగాధర్, జిల్లాలోని వ్యవసాయ శాఖాధికారులు, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిషేధంపై ప్రతిజ్ఞ



మొక్క నాటుతున్న జెడ్పీ చైర్మన్, సీఈఓ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): మార్పు అనేది మన నుంచే ప్రారంభం కావాలని జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మణరావు అన్నారు. జిల్లా పరిషత్ ప్రాంగణంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు సిబ్బందికి వివరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం సభ్యులు, మత్తు, మాదక ద్రవ్యాల విముక్తి కేంద్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

యోగాపై వివిధ పోటీలు



యోగా పోటీల్లో వేసిన రంగవల్లులను పరిశీలిస్తున్న అధికారులు

కరప: వివిధ యోగా అంశాలపై స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం పోటీలు నిర్వహించారు. మండలంలో గత నెల 26 నుంచి 29వ తేదీ వరకు జరిగిన గ్రామ స్థాయి యోగా పోటీలలో ఎంపికైన వారికి మండల స్థాయి కాంపిటీషన్స్ నిర్వహించినట్టు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. యోగా(సోలో)లో సూర్యనమస్కారం, మెడిటేషన్, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విజేతలకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే బహుమతులు ప్రదానం చేస్తారని ఎంపీడీఓ తెలిపారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు, ఏఓ బీఎస్ నరసింహం, ఆయుర్వేద డాక్టర్ బి.దివ్య, యోగా మాస్టర్, ఇన్‌స్ట్రక్టర్లు పి.లోవరాజు, ఎ.బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

కరప: గోదావరిలో మునిగి మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ గురువారం కాకినాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఎక్స్‌గ్రేషియో రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. కరప మండలం గురజనాపల్లి గ్రామానికి చెందిన తాతపూడి నితీష్ గత నెల 25న స్నేహితులతో కలిసి ముమ్మిడివరం వద్ద గోదావరిలోకి స్నానానికి వెళ్లి, మృతిచెందిన విషయం విదితమే. మృతుని తండ్రి తాతపూడి రాజుకు ఎమ్మెల్యే ఈ చెక్కును అందజేశారు. తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ, ఆర్ఐ పవన్ తదితరులు పాల్గొన్నారు.

ముప్పతిప్పలు

- టూటౌన్–భానుగుడి ఫ్లైఓవర్‌కు పొంచి ఉన్న అపాయం
- అధికారుల నిర్లక్ష్యంతో దెబ్బతింటున్న వంతెన
- రక్షణ గోడల్లో మొలుస్తున్న పిచ్చి మొక్కలు
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు

కాకినాడ లీగల్: అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. వారి నిర్లక్ష్య వైఖరితో కీలకమైన నిర్మాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఎదురవుతున్నాయి. నగరంలో ఎంతో కీలకమైన టూటౌన్ నుంచి భానుగుడి వెళ్లే ఫ్లైఓవర్‌లోని రెయిలింగ్‌కు పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ వంతెన రెయిలింగ్ పగుళ్ల నుంచి పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. చాలా కాలంగా ఈ ఫ్లైఓవర్‌కు నిర్వహణ కానీ, మరమ్మతులు కానీ చేయలేదు. దీంతో ఫ్లైఓవర్ దుస్థితిపై నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కీలకమైన వంతెన

ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఉదయం నుంచి రాత్రి పది గంటల వరకూ క్షణం తీరిక లేకుండా వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. నిత్యం ఈ బ్రిడ్జిపై వాహనాల రద్దీ కొనసాగుతూనే ఉంటుంది. వేలాది వాహనాలతో పాటు, పాదచారులు సైతం రాకపోకలు సాగిస్తుంటారు. ఇది మరమ్మతులకు గురవుతున్నా.. అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో అనేక చోట్ల వంతెన దెబ్బతింది. వంతెన రెయిలింగ్‌కు పగుళ్లు ఏర్పడి, పిచ్చి మొక్కలు మొలిచాయని స్థానికులు చెబుతున్నారు. ఈ బ్రిడ్జి కింద నుంచే అధిక సంఖ్యలో ప్రజల చిన మార్కెట్‌కు, బస్టాండ్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిడ్జికి మరమ్మతులు చేయించాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణికుల భయాందోళన

జిల్లా కేంద్రమైన కాకినాడకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారు దాదాపు ఈ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. కలెక్టర్ సైతం నిత్యం తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తారు. రహదారులు, భవనాల శాఖ ఉన్నతాధికారులు కూడా ఈ మార్గంలోనే తమ కార్యాలయాలకు రాకపోకలు కొనసాగిస్తారు. అయినప్పటికీ ఎవరూ ఈ వంతెనను పట్టించుకున్న దాఖలాలు లేవు. ఉదయం నుంచి రాత్రి వరకూ సుమారు 10 వేల నుంచి 20 వేల మంది తమ వాహనాలతో ప్రయాణం చేస్తుంటారు. ఇక బ్రిడ్జి కింద నుంచి వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇటువంటి బ్రిడ్జికి మరమ్మతులు చేయకపోవడం దారుణమని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఫ్లైఓవర్ వంతెన రెయిలింగ్‌పై పెరిగిన పిచ్చి మొక్కలు



ధ్వంసమైన ఫ్లైఓవర్ రెయిలింగ్



టూటౌన్ వైపు ఫ్లైఓవర్ బ్రిడ్జి

పిచ్చి మొక్కలు తొలగించాలి



బ్రిడ్జి రెయిలింగ్ పక్కన పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయి. మొక్కుబడిగా ఆ మొక్కల కొమ్మలను తుంచి వదిలేస్తున్నారు. దీంతో మళ్లీ చిగురించి, మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. వంతెన గోడల్లో పెరిగిపోతున్న ఈ మొక్కలను వేళ్లతో సహా తొలగించి, మళ్లీ మొలవకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి.

– జీఎస్ఆర్ కృష్ణారావు, స్థానికుడు

అధికారులు దృష్టి పెట్టాలి



బ్రిడ్జి రెయిలింగ్‌కు మరమ్మతులు చేయించాలి. మరమ్మతులు చేయకుండా, రంగులు వేసి మెరుగులు దిద్దారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి.. బ్రిడ్జి రెయిలింగ్‌కు మొలుస్తున్న మొక్కల తొలగింపునకు శాశ్వత చర్యలు చేపట్టాలి. లేకపోతే సమస్య తీవ్రమవుతుంది.

– ఎస్వీ వెంకటరమణ, స్థానికుడు

అన్నదాతకు కష్టాలెన్నో..!

సీఎంఆర్ సొమ్ము అందక రైతుల ఇబ్బందులు



ఆర్ఎస్‌కేలో ఇచ్చిన ఎఫ్‌టీఓ స్టేటస్

కరప: రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించిన ధాన్యానికి రెండు రోజుల్లోనే నగదు జమ చేస్తున్నామని కూటమి ప్రజాప్రతినిధులు, అధికారుల మాటలు కేవలం ప్రకటనలకే పరిమితమని, ఆచరణలో కానరావడం లేదని రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధాన్యం అమ్మకాలు జరిపి 25 రోజులైనా బ్యాంక్ ఖాతాల్లో సొమ్ము జమ కాక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథులే కరవయ్యారని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. కరప మండలం వేళంగి రైతు వాసిరెడ్డి వీరవెంకటసత్య రామమోహనరావు ఇందుకు నిదర్శనం. వేములవాడ ఆర్ఎస్‌కే ద్వారా గత నెల 12వ తేదీన 68 క్వింటాళ్ల ధాన్యం విక్రయించగా, దీనికి రూ.1,56,400 ఖాతాలో జమ కావాల్సి ఉంది. ఇంతవరకూ ఒక్క రూపాయి కూడా జమ కాలేదని గురువారం రైతు రామమోహన్‌రావు తెలిపారు. రబీ సాగుకు చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని, మరోవైపు సార్వా నారుమళ్లు వేసుకోవడానికి విత్తనాలు కొనుగోలుకు, ఇతర పెట్టుబడులకు నగదు అవసరం ఉందని వాపోయాడు. బ్యాంకు, రైతు సేవా కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ కావడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఆర్ఎస్‌కే ద్వారా విక్రయించిన ధాన్యం సొమ్ము జమయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతు రామమోహన్‌రావు కోరారు.

ఉక్కిరిబిక్కిరి

- రోహిణికార్తెలో వేసవి తీవ్రత
- పట్టుకుంటే కాలుతున్న ఇంట్లో సామగ్రి
- సాయంత్రం 6 గంటలైనా తగ్గని వేడిగాలులు



నిర్మానుష్యంగా కరప-అరట్లకట్ట రోడ్డు

కరప: ప్రచండ భానుడు ఉగ్రరూపానికి ప్రజలు గడగడలాడుతున్నారు. నాలుగు రోజులుగా కొనసాగుతున్న వడగాడ్పులకు ప్రజలు విలవిల్లాడుతున్నారు. భానుడు నిప్పులు చెరుగుతుండటంతో వేసవితాపానికి గ్రామాల్లో ప్రజలు బేజారవుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నాటి ఎండలకు వృద్ధులు, పిల్లలు ఠారెత్తారు. అల్పపీడన ప్రభావతంతో కురిసిన వర్షాలకు వాతావరణం చల్లబడి, వడగాడ్పుల బాధ తప్పిందనుకుంటే.. నాలుగు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 38 నుంచి 40 డిగ్రీలు నమోదవుతున్నాయి. దీంతో వడగాడ్పులు భరించలేకపోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం ఏడు నుంచే ఎండ తీవ్రంగా ఉండటంతో ప్రజలు బయటకు రావడానికే భయపడుతున్నారు. సాయంత్రం ఆరు గంటలైనా ఎండ తీవ్రత తగ్గడం లేదని, వడగాడ్పులు వీస్తున్నాయని అంటున్నారు. గ్రామాల్లోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. కరప, నడకుదురు, వేళంగి, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, అరట్లకట్ట తదితర గ్రామాల్లో మధ్యాహ్నం 11 గంటలకే షాపులన్నీ మూతపడుతున్నాయి. నిత్యం జనంతో రద్దీగా ఉండే కరపలోని మెయిన్ రోడ్డు జనసంచారం లేక వెలవెలబోతోంది. ఎండ వేడిమితో అల్లాడుతున్న జనానికి, వేడిగాలులు మరింత ఇబ్బంది పెడుతున్నాయి. ఎండ, వేడిగాలుల ప్రభావంతో బయటకు రావాలంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇళ్లలోని వాటర్ ట్యాంకుల్లో నీరూ వేడెక్కిపోతోంది. ఇంటి సామాన్లు సైతం వేడిగా ఉంటున్నాయి. అత్యవసర పనులున్న వారు మినహా ఎవరూ ఇంటి నుంచి బయటకు రావడం లేదు. వడదెబ్బకు జడిసి జనాలు జాగ్రత్త పడుతున్నారు. రోహిణీ కార్తె ప్రారంభంలో చిరుజల్లులు పడి చల్లబడిందనుకుంటే, రోజురోజుకూ పెరుగుతున్న వేసవితాపం భరించలేకపోతున్నామని ప్రజలు అంటున్నారు. వాతావరణం చల్లపడేందుకు భారీ వర్షాలు పడాలని ప్రజలు కోరుకుంటున్నారు.



జన సంచారం లేని కరప-రామచంద్రపురం రోడ్డు



కర్ఫ్యూను తలపిస్తున్న కరప-కాకినాడ రోడ్డు

ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలు సందర్శించాలి

జేసీ రాహుల్ మీనా

బాలాజీచెరువు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వేసవి సెలవుల్లో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సందర్శించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఆదేశాల మేరకు గత నెల 28 నుండి నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ, వేసవి సెలవుల్లో విద్యార్థుల సమయం వృథా కాకుండా, వారిలో పఠనాశక్తిని కలిగించడం, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించడం లక్ష్యాలుగా శిబిరాలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. వివిధ అంశాలపై పుస్తక పఠనం, కథలు చెప్పించడం, ప్రముఖులతో అవగాహన సదస్సులు, విజేతల పుస్తకాలతో పాటు, కవులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలు, దినపత్రికలు, నృత్యం, పప్పెట్ల తయారీ వంటి వాటిపై శిక్షణ ఇచ్చారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కార్యదర్శి పాలంకి నాగరాజు, డీఎల్ కె.కిషోర్, ఎల్.వేంకటేశ్వరరావు, శ్రావ్య, సాయివెంకటరావు, రవికుమార్, రాజు, వీర్రాజు, దుర్గాప్రసాద్, ప్రియదర్శిని, నాగేంద్ర పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధికారులు

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపిక



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): డిగ్రీ ఆఖరి సంవత్సరం పూర్తయ్యేలోపు పట్టాతో పాటు, ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమని ఆదిత్య డిగ్రీ కళాశాల ఏడీ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అన్నారు. టీసీఎస్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 485 మంది ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. డిగ్రీ మొదటి ఏడాది నుండి సీఆర్‌టీ (క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్) తరగతులు నిర్వహించి, విద్యార్థులకు మంచి నైపుణ్యాలు కల్పిస్తున్నామన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, డైరక్టర్ సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్ కరుణ, బ్యూలా, షాహిద్దీన్ తదితరులు గురువారం కళాశాలలో అభినందించారు.



మొక్కలు నాటుతున్న ఐఎంఏ సీనియర్ సభ్యులు లక్ష్మీనారాయణ



కాకినాడ రూరల్ ఏపీఎస్పీ బెటాలియన్‌లో..



కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యక్రమంలో ప్రతిజ్ఞ



బోట్ క్లబ్‌లో మొక్కలు నాటుతున్న సొసైటీ, వాకర్స్ సభ్యులు



కరప ఎంపీడీఓ కార్యాలయం వద్ద..

జీవ వైవిధ్యానికి ప్లాస్టిక్ రహిత సమాజం

- పర్యావరణ దినోత్సవంలో డీఈఓ పిల్లి రమేష్
- మొక్కలు నాటిన ప్రముఖులు



రంగరాయ వైద్య కళాశాలలో సదస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

బాలాజీచెరువు: ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములై జీవవైవిధ్యం కాపాడాలని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం రాజీవ్‌గాంధీ మున్సిపల్ పాఠశాల, సాలిపేట బాలికల ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఈఓ రమేష్ మాట్లాడుతూ, సకల జీవాలకు ఆధారమైన భూమిని కాపాడుకోవడం అందరికీ అవసరమని, ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించి భూకాలుష్యం తగ్గించాలన్నారు. యంగ్‌మైండ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ(చిన్న) మాట్లాడుతూ, పరిశ్రమలతో వెలువడే వ్యర్థాల వల్ల కంటే, ప్లాస్టిక్ వాడకం, మొక్కలను సంరక్షించకపోవడం వంటి వాటి వల్ల వాయు కాలుష్యం మితిమీరుతోందన్నారు. ఏడీ రాజశేఖర్, శ్రీరామ్, చింతాడ ప్రదీప్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణమే ప్రాణం

కాకినాడ క్రైం: పర్యావరణమే ప్రాణమని, మనిషి మనుగడకు కారణమని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ప్రిన్సిపాళ్లు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాకినాడ జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు విశాల్, శ్రీనివాసన్, డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. డెమో ప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత

బోట్‌క్లబ్: సమాజంలో ప్రతి ఒక్కరికీ మొక్కలు నాటే బాధ్యత ఉందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సీనియర్ సభ్యులు లక్ష్మీనారాయణ తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, డెంటల్ అసోసియేసన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా వైద్యులు మొక్కలు నాటారు. ప్రస్తుత కాలంలో ప్లాస్టిక్ కాలుష్యంపై బలమైన దృష్టి సారించాలని కోరారు. సంఘ కార్యదర్శి చిట్ల కిరణ్ మాట్లాడుతూ, పర్యావరణ వ్యవస్థలు, వన్యప్రాణులు, మానవ ఆరోగ్యంపై ప్లాస్టిక్ వ్యర్థాల హానికరమైన ప్రభావాలపై ప్రజలకు అవగాహన అవసరమన్నారు. డెంటల్ అసోసియేషన్ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన వేడిగాలులు, ఉష్ణోగ్రతలను తగ్గించడానికి తోటల విస్తృత పెంపకం ఒక్కటే మార్గమన్నారు. వైద్యులు రజని, శ్రీవల్లి, చైతన్య, ఆదిత్య పాల్గొన్నారు.

కొండయ్యపాలెం అర్బన్ పీహెచ్‌సీలో..

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కాకినాడ గైనకాలజీ సొసైటీ సెక్రటరీ డాక్టర్ ఎఎల్ సత్యవతి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక కొండయ్యపాలెం అర్బన్ పీహెచ్‌సీలో సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కొన్నేళ్లుగా పర్యావరణాన్ని నష్టపర్చడం వల్ల పరిణామాలు ఎంత ఘోరంగా ఉన్నాయో ఇప్పుడు చూస్తున్నామన్నారు. అనంతరం సొసైటీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో ఔషధ గుణాల మొక్కలను నాటారు. సొసైటీ సభ్యులు కె.సత్యనారాయణ, శైలజ, సౌజన్య, మాధవి, సుష్మా, స్వప్నిక, రాజమ్మ, కొండమూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే..

కాకినాడ రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాకినాడ రూరల్‌లో పలుచోట్ల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక రమణయ్యపేట ఏపీఎస్పీలో కమాండెంట్ ఎం.నాగేంద్రరావు సిబ్బందితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, ఎంపీడీఓ సతీష్, ఈఓ పీఆర్అండ్ఆర్‌డీ రామాంజనేయులు తదితరులు మొక్కలు నాటారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ గణేష్ పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. తిమ్మాపురం పంచాయతీ పరిధిలో అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీ ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కలు నాటారు. బోట్ క్లబ్ ఉద్యానవనంలో వన్ స్టెప్ టువార్డ్స్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. డాక్టరు రాఘవేంద్రరావు, జె.రామకృష్ణ, అడబాల రత్నప్రసాద్, దాసరి శ్రీధర్, రామారావు, ఆనంద్, బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో పర్యావరణ పరిరక్షణ

కరప: పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి అవసరమని ఎంపీడీఓ ఎం.అనుపమ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కరపలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి యు.నిర్మలాదేవి, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అనుపమ మాట్లాడుతూ, వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అధికారులు, ఉద్యోగులు పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద, ఉపాధి పథకం, కార్యాలయ సిబ్బందితో కలిసి ఎంపీడీఓ మొక్కలను నాటారు. ఏఓ బీఎల్ నరసింహం, ఉపాధి హామీ ఏపీఓ హేమమాధవి, జేఈ సంగీతలక్ష్మి, కార్తీక్, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రమేష్



డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో..



నన్నయ పీజీ సెంటరులో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్